క్లుప్తంగా

బీసీ హాస్టల్‌లో ప్రవేశాలు లేవు


ఇంగళదహాళ్ బీసీ హాస్టల్

హొళగుంద: మండల పరిధిలోని ఇంగళదహాళ్ బీసీ హాస్టల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త అడ్మిషన్‌లు లేవని హాస్టల్ వార్డన్ శివుడు ఓ ప్రకటనలో తెలిపారు. 1982లో నిర్మించిన హాస్టల్ గదులు వర్షాకాలంలో ఉరుస్తుండడం వల్ల విద్యార్థులు ఉండేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. విషయాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ అనంతరం వారిచ్చే ధ్రువీకరణ పత్రం ఆధారంగా వీలైతే కొత్త విద్యార్థులను తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. అయితే గదులు ఉరుస్తుండడం వల్ల ప్రస్తుతం ఉన్న 165 మంది విద్యార్థులను కాకుండా ఈ ఏడాది కొత్త విద్యార్థులు చేరేందుకు అవకాశముండదని తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: దేవరగట్టులోని మాళ మల్లేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పంట నష్టపరిహారం మంజూరు


జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు

మద్దికెర: మండలంలోని 6826 మంది రైతులకు రూ.7.05 కోట్ల ఖరీఫ్ పంట నష్ట పరిహారం మంజూరైనట్లు ఏఓ రవి ఆదివారం తెలిపారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో 2023 ఖరీఫ్ పంటలకు సంబంధించి పరిహారం మంజూరైన రైతుల జాబితాను ప్రదర్శించారు. బసినేపల్లిలో 777 మంది, బురుజుల 51, హంప 1360, ఎం.అగ్రహారం 134, మద్దికెర తూర్పు 1192, పడమర 31, ఉత్తరం 26, ఎడవలి 909, పెరవలి 2346 మంది రైతులకు 14,463 ఎకరాలకు పరిహారం మంజూరైందన్నారు.

మురుగు నీరు పారదు.. సమస్య తీరదు


కోయనగర్ కాలనీలో నిలిచిన మురుగు నీరు

ఆలూరు రూరల్: పట్టణంలోని కోయనగర్ కాలనీలో మురుగు నీరంతా ఒకదగ్గర చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం. ఆలూరు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

లూజు పెట్రోలు అమ్మితే చర్యలు

పత్తికొండ రూరల్: ఖాళీ బాటిళ్లు, క్యాన్‌లలో లూజుగా పెట్రోలు, డీజిల్ విక్రయించవద్దని పత్తికొండలోని పెట్రోలు బంకుల యజమానులకు పోలీసు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా పత్తికొండ టౌన్ సీఐ మురళీమోహన్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని అనుసరించి జూన్ 10వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో నిఘా కొనసాగుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి పెట్రోలు బంకు లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా 'ఖాళీ సీసాలు, క్యాన్లకు పెట్రోలు/డీజిల్ పోయం' అని తెలియపరిచేలా పెద్ద పోస్టర్లను పెట్రోలు బంకు వద్ద అతికించాలని సూచించారు.

గుండెపోటుతో రైతు మృతి


బోయ రామచంద్ర (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్న హుల్తి గ్రామానికి చెందిన కప్పట్రాళ్ల బోయ రామచంద్ర (57) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తూ గుండెపోటుతో కుప్ప కూలిపోయారు. గమనించిన రైతులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం

- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి అవకాశం
- డెంగీ, మలేరియా నివారణకు వైద్యశాఖ చర్యలు
- దోమల నివారణపై అధికారులు దృష్టి

వేసవి కాలం.. పగటిపూట తారెత్తిస్తున్న ఎండలు. సాయంత్రం మబ్బులు కమ్మేసి వర్షాలు. ఈ ఆకస్మిక వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఎక్కువ. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా సోకే అవకాశం ఉంది. అందుకే వైద్య నిపుణులు ఆరోగ్య భద్రత ముఖ్యమని హెచ్చరిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు. జాతీయ డెంగీ నివారణ వారోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా నియంత్రణ సిబ్బంది దోమల కట్టడికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గ్రామాల్లో దోమల నివారణపై దృష్టి సారించారు.



విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది (ఫైల్)

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సచివాలయాల పరిధిలో వెస్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం ఇంటింటి వైద్య సేవలు అందిస్తోంది. గత నెలలో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ నెలలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. అక్కడక్కడ వర్షపు నీరు నిలిచి దోమలు పెరిగి పలు రకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితులు వస్తున్నాయి. వైద్య సిబ్బంది ముందుగానే విషజ్వరాల పరీక్షలు చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే రక్త కణాల పరీక్షలు జరిపి, పరిస్థితి తీవ్రంగా కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువ ఉన్న రోగులకు రక్తం, ప్లేట్‌లెట్స్ కోసం రెఫర్ చేస్తున్నారు.

డెంగీపై అప్రమత్తం

ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. దీంతో వైద్యారోగ్యశాఖ సిబ్బందితో జాతీయ డెంగీ నివారణ వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏడిస్ దోమ కాటు వల్ల డెంగీ సోకుతుంది. ఈ దోమ నలుపు, తెలుపు చారలతో ఉంటుంది. ఇవి శుభ్రమైన నీటి నిల్వలోనే గుడ్లుపెడతాయి. సూర్యోదయానికి ముందు రెండు గంటలు, సూర్యోదయం తర్వాత రెండు గంటలు మాత్రమే కుడుతుంది. దీని జీవిత కాలం రెండు వారాలు. మూడు సార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ఇంట్లోని బట్టలు, పరుపులు, తెరల వెనుక దాక్కొని ఉంటాయి.

ఈ లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి

డెంగీ, విష జ్వరాల చికిత్సకు నిర్దిష్టమైన మందులు లేవు. జ్వరం ఉన్నప్పుడు ఎక్కువ శాతం విశ్రాంతి, ద్రవపదార్థాలు తీసుకోవాలి. మూత్రవిసర్జన తగ్గడం, నోరు, పెదవులు పొడిబారడం, నీరసం, జలుబు, చేతులు, కాళ్లు బిగుసుకుపోవడం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు, శరీరంపై దద్దర్లు రావడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సూచనలు లేకుండా మందులు వాడరాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దోమలు పుట్టకుండా.. కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.
- దోమ తెరలు వాడాలి. దోమల స్ప్రే వాడొచ్చు.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, వాటర్ బాటిళ్లు, కూలర్‌లలో నీరు నిల్వ ఉంచరాదు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో డెంగీ వ్యాధి సోకుతోంది. ఇంట్లో నీరు నిల్వ ఉంచుకోరాదు. ఉతికిన బట్టలు వెంటనే ఆరవేయాలి. మూడు పూటల వేడి ఆహారం తీసుకోవాలి. డెంగీ వ్యాధి లక్షణాలు ఉంటే దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. వైద్యుల సూచనలు తీసుకోకుండా మందులు వాడరాదు. విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

–వాహిద్, డాక్టర్, ఆలూరు సీహెచ్‌సీ

రేపు మండల మీట్

హొళగుంద: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. సమావేశంలో అభివృద్ధి పనులు, అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. ఆయా శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

చిప్పగిరికి 20 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు

చిప్పగిరి: మండలానికి 20 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 10 క్వింటాళ్ల కందులు మంజూరైనట్లు ఏఈ విజయ లక్ష్మీ తెలిపారు. రాయితీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ సోమవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. క్వింటాల్ వేరుశనగ రూ. 9,500 కాగా ప్రభుత్వ రాయితీ 40 శాతం పోను రైతులు రూ. 5,700 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసకోవాలని సూచించారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

పత్తికొండ రూరల్: రాయితీపై వేరుశనగ విత్తనాలు పొందడానికి సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు తెలిపారు. 30 కేజీల బస్తా రూ.1710, 60 కేజీలు రూ.3420, 90 కేజీలకు రూ.5130 చెల్లించి ఈ నెల 25వ తేదీలోగా ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. నల్లరేగడి భూములకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


హోసూరులో సోదాలు చేస్తున్న పోలీసు అధికారులు

పత్తికొండ రూరల్: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పత్తికొండ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అత్యంత సమస్యాత్మక హోసూరు గ్రామంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. తుగ్గలి, జొన్నగిరి, మద్దికెర, పత్తికొండ ఎస్ఐలతో వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఐదు లీటర్ల నాటు సారా, 24 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన తర్వాత పలు ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘటనల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో నిర్బంధ తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఫలితాలు వచ్చిన తరువాత గొలుపోటములు ఎలా ఉన్నా ఎవరూ గొడవలకు పాల్పడవద్దని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై తీవ్రమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

22 నుంచి వెంకప్పస్వామి ఆరాధనోత్సవాలు

మద్దికెర: మండల కేంద్రం సమీపంలోని బొజ్జనాయునిపేట గ్రామంలో ఈ నెల 22వ తేదీ నుంచి వెంకప్పస్వామి ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 23న గురువారం ఉదయం స్వామివారి సమాధిని అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరుగుతుంది. సంతానం కలగని వారు స్వామివారిని నాలుగు సోమవారాలు మొక్కుకుంటే కోరిక నెరవేరుతుందని భక్తుల విశ్వాసం.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన రామలింగ

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామానికి చెందిన రామలింగ అనే యువకుడు ఆదివారం హాలహర్వి గ్రామ శివారులో బైకుపై వస్తుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు రామలింగను 108 వాహనంలో బళ్లారిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి

ఆలూరు: ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం కావాలని ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునీత అన్నారు. 75 గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఈనెలాఖరుకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ముందస్తు వర్షాలతో వేరుశనగ, ముంగారి పత్తి, మినుము, కంది, ఆముదం తదితర పంటలను సాగు చేస్తున్న రైతులు మెట్ట భూముల్లో లో దుక్కులు చేసుకోవాలని సూచించారు. దీని వల్ల పొలాల్లోని చీడపీడలన్నీ బయటకు వచ్చి నశిస్తాయని తెలిపారు. ఆయా గ్రామాల ఏఓలు, ఎంపీఈఓలు, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. విత్తు ఎంపికలో నాణ్యత ప్రమాణాలను పాటించేందుకు రైతులు ప్రయత్నించాలని ఏడీఏ అన్నారు.

కలుషిత నీరే ఆ గ్రామానికి తాగునీరు

చిప్పగిరి: ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కలుషితమైన నీరే తిమ్మాపురం గ్రామానికి తాగు నీరుగా మారింది. గ్రామంలో 450 మంది ఓటర్లు ఉన్నారు. తాగడానికి నీటి సౌకర్యం లేకపోవడంతో గ్రామంలోనే బోర్లు వేసి నీటిని వాటర్ ట్యాంకులో నింపి ప్రజలకు అందించే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏళ్ల గడుస్తున్నా ట్యాంకును శుభ్రం చేయకపోవడం తో పాచి, దుర్వాసనతో నీరు కలుషితంగా మారాయి. ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. ట్యాంకును శుభ్రం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు


- బండలాగుడు విజేత ఎస్.కొత్తూరు వృషభాలు

హోరాహోరీగా బండలాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో నాలుగు రోజులుగా జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్. కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రమణ్యంరెడ్డి వృషభాలు 5,250 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం మాచానిపల్లె గ్రామానికి చెందిన సాకం బ్రహ్మానందారెడ్డి వృషభాలు 5,040 అడుగులు లాగాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామం జంగం గురులోహిత్, ఇదే జిల్లా బుక్కారాయసముద్రం మండలం రేగడి కొత్తూరు గ్రామానికి చెందిన భూమిరెడ్డి గౌతంరెడ్డి వృషభాలు సంయుక్తంగా 4,750 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. జోగులాంబ గద్వాల జిల్లా చెర్లగార్లపాడు గ్రామానికి చెందిన రామాంజనేయులు, సీ.బెలగల్ మండలం, వినకండ్ల గ్రామానికి చెందిన వేణుగోపాల్ వృషభాలు సంయుక్తంగా 4,607 అడుగులు లాగి నాల్గో స్థానంలో నిలిచాయి. ఐదో స్థానంలో డోన్ మండలం కొచ్చెర్వు బజారి లక్ష్మీదేవమ్మ వృషభాలు 3,303 అడుగులు లాగినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాలకు దాతలు, సర్పంచ్ బోయ సర్వేశ్వరి వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను అందజేశారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం


రైతులకు పరికరాలు అందిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సుధాకర్, అలీ బాషా, గంధర్వ ఆచారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు డ్రమ్ములు, తారు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తొమ్మిది రకాల విత్తనాలు అందజేశామని తెలిపారు. అలాగే 123 మంది సన్న, చిన్నకారు రైతులకు ఒక్కొక్కరికి రెండు డ్రమ్ములు, తారు పట్టాలను పంపిణీ చేశామని వెల్లడించారు. ఏడాదికేడాది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వస్తున్నారని.. వారందరికీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో షేక్ మాబువలి, జనార్దన్, పరమేశ్వరుడు, బాలకృష్ణ, రామచంద్రుడు, రామకృష్ణారెడ్డి, రవి, వలీ, జయమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.


జొన్నగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

తుగ్గలి: అరె..అతను నాగరాజుగుప్త కదా..! ఎంతలా మారిపోయాడు. స్కూల్‌లో ఉన్నప్పుడు ఎలా ఉండేవాడు. అసలు..గుర్తుపట్టలేదు తనను..అని చిన్ననాటి స్నేహితులంటుంటే..మనం ఇప్పుడా..అప్పుడా..ఎప్పుడో 35 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నాం. ఆ తర్వాత మళ్లీ కలుసుకున్నది కూడా లేదు. పిల్లలకు కూడా పెళ్లిళ్లు అయిపోయాయి. ఇన్నేళ్ల తర్వాత కూడా మారిపోకుండా ఇంకా చిన్నప్పటి లాగే ఉంటారా..అంటూ బాల్య మిత్రుడు నవ్వుతూ అన్నాడు. తమకు చదువు చెప్పిన గురువుల్లో కాలం చేసిన వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కుశల ప్రశ్నలు వేసుకుంటూ మిత్రులంతా రోజంతా సందడిగా గడిపారు. 30 ఏళ్ల అనంతరం అప్పటి స్నేహితులంతా ఒక్కచోట కలిస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేనిది. మండల పరిధిలోని జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1990–91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా ఇప్పటికే రూ.3లక్షలతో తాగునీటి బోరు, ట్యాంకులు, నేమ్‌బోర్డు వంటివి ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు గిరేంద్ర, సురేష్, మురళి, ప్రసాద్‌రెడ్డిలను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటగిరి, మధు, రామదాసు, శివ, గిరి, సురేష్, అరుణ, లక్ష్మీదేవి, పీఎంసీ చైర్మన్ రఘు, సీఆర్పీ నాగేష్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం


రిటైర్డు హెచ్‌ఎంను సన్మానిస్తున్న పీఈటీలు

పత్తికొండ రూరల్: వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ హెచ్‌ఎంగా పదోన్నతి పొంది పదవీ విరమణ పొందిన పత్తికొండకు చెందిన ఎం.సురేష్‌బాబును ఆదివారం సన్మానించారు. పత్తికొండ ఇండోర్ స్టేడియంలో పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆయన సేవలను కొనియాడారు. పత్తికొండకు చెందిన సురేష్‌బాబు విద్యాభ్యాసమంతా పత్తికొండలోనే సాగింది. 1993లో సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరారు. ఆ తరువాత 2000లో ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ఎమ్మిగనూరు ప్రభుత్వ హైస్కూల్‌లో పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా పత్తికొండ హైస్కూల్‌కు వచ్చి 8 ఏళ్లు పనిచేశారు. 2023లో ఫిజికల్ డైరెక్టర్‌గా లొద్దిపల్లె హైస్కూల్‌కు వెళ్లారు. అనంతరం ఆలూరు మండలం హోలీబీడు హైస్కూల్ హెచ్‌ఎంగా పదోన్నతి పొంది ఏడాది పాటు పనిచేసి పదవీ విరమణ పొందారు. వ్యాయామ ఉపాధ్యాయుడి నుంచి హెచ్‌ఎంగా పదోన్నతి పొంది పదవీ విరమణ పొందిన ప్రత్యేకత దక్కించుకున్నారు. పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు చందూనాయక్, సెక్రెటరీ రంగస్వామి, పీఈటీలు సంజప్ప, వేణు, పాండు, హనుమన్న, రాజేష్, మధు, అంజి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి జీవితం అందరికీ ఆదర్శం


ఆలూరు: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు,


వెల్దుర్తి: నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


హొళగుంద సీపీఎం కార్యాలయంలో.. ,


దేవనకొండలో..

తుగ్గలి: భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై జీవితాంతం పోరాడిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం తుగ్గలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుందరయ్య జీవితం నేటి తరాలకు ఆదర్శమన్నారు. దేశంలోనే మొదటిసారిగా కార్మిక, కర్షక సంఘాన్ని స్థాపించి వ్యవసాయ కార్మిక హక్కుల కోసం పోరాడిన మహోన్నతుడన్నారు. దేశ మొదటి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడిగా దేశాభివృద్ధిలో కార్మిక, కర్షకుల శ్రమ ఎంతో ఉందని చెప్పిన శ్రామిక పక్షపాతి అని కొనియాడారు.

- ఆలూరు: ఆదర్శ ప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకులు కేపీ, నారాయణ స్వామి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. మండల కార్యదర్శి షాకీర్, కృష్ణ, నాగరాజ్, వీరేష్, శేఖర్, మైనా, విఠల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.
- వెల్దుర్తి(కృష్ణగిరి): కార్మికులు, కష్ట జీవుల కోసం నిస్వార్థంతో పోరాటాలు చేసిన యోధులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, కేరళ మాజీ సీఎం ఈకే నాయనర్ అని.. వీరి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సీఐటీయూ నేతల రాజు అన్నారు. వెల్దుర్తిలోని మోటార్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య, నాయనర్ చిత్రపటాలకు పుల మాలలు వేసి జోహార్లు తెలిపారు. సీఐటీయూ నాయకులు వెంకటరాముడు, మహేష్, నాగరాజు, శ్రీను, సలాం, బద్రి పాల్గొన్నారు.
- దేవనకొండ: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు అశోక్, వీరశేఖర్, నాయకులు రమేష్, బండ్లయ్య, బలరాముడు, పెద్దయ్య, రాము, రవితేజ పాల్గొన్నారు.
- ఆస్పరి: నిరుపేదల కోసం అలుపెరగని పోరాటం చేసిన కమ్యూనిస్టు యోధుడు పుచ్చల పల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు అన్నారు. ఆస్పరి, కైరుప్పల గ్రామాల్లో వర్ధంతిని జరుపుకున్నారు. సీపీఎం నాయకులు హనుమంతు, మాణిక్యప్ప, బాలకృష్ణ, రామాంజనేయులు, రవి, మహేష్, కాశన్న, రమేష్, సతీష్ పాల్గొన్నారు.
- హొళగుంద: నేటి రాజకీయ నేతలు, యువత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం, సీఐటీయూ మండల కార్యదర్శులు వెంకటేశ్, చాకలి నాగరాజు అన్నారు. హొళగుందలో సుందరయ్య చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్మికుల సంక్షేమం కోసం సుందరయ్య చేసిన పోరాటాలను కొనియాడారు. నాయకులు రంగన్న, రవికుమార్, హంపయ్య, నాగప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.